క్లుప్తంగా

వేగంగా ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణం


ఆర్‌బీకే భవనాన్ని పరిశీలిస్తున్న మహబూబ్‌బాషా

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చకచక జరుగుతున్నాయని మండల ఇంజినీరు మహబూబ్‌బాషా తెలిపారు. గ్రామంలో జరుగుతున్న కొత్త భవన నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణాలు దాదాపుగా పూర్తి అయినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవస్థానం ఈఓగా దినేష్



కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవస్థానం ఈఓగా దినేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పని చేసిన సీతారామిరెడ్డి గార్గేయపురం చెన్నకేశవస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఈఓ దినేష్ మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి దేవస్థానం పునర్నిర్మాణానికి, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కర్నూలు - గుంటూరు రోడ్డులో దేవస్థానం సిబ్బంది, పోలీసుల పర్యవేక్షణలో ట్రాఫిక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దేవస్థానంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం


విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

గడివేముల: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మంగళవారం సత్కరించి నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ మాట్లాడుతూ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థినీ మహిమలత రూ.3 వేల నగదు, రెండో స్థానంలో నిలిచిన భారతికి రూ.2 వేల నగదు, సిల్వర్ మెడల్, మూడో స్థానంలో నిలిచిన సరళకు రూ. వెయ్యి, ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. కార్య క్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వర రెడ్డి, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ రుబీనా తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని షార్ట్‌సర్క్యూట్‌తో ఓ వానరం చనిపోయింది. మంగళవారం ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు చనిపోయిన వానరాని చూసి చలించిపోయారు. వానర మృతదేహాన్ని పూజించి అంత్యక్రియలు చేశారు. అంతేకాక అంత్యక్రియలు చేసిన తర్వాత మహిళలు కొబ్బరికాయులు కొట్టారు.

ఓపెన్ బ్లాస్టింగ్ ఆపేయాలి

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితంతండా వద్ద జరుగుతున్న జల విద్యుత్ ఉత్పాదక పరిశ్రమ నిర్మాణ పనులలో చేపడుతున్న ఓపెన్ బ్లాస్టింగ్‌ను ఆపేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఓపెన్ బ్లాస్టింగ్ పనుల చేపట్టడం వలన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని మంగళవారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సీఐటీయూ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ గ్రామానికి దగ్గరలోనే ఓపెన్ బ్లాస్టింగ్ చేయడం వల్ల ఇంటి ముందు కసువు ఊడుస్తున్న స్వామి నాయక్ కూతురుకు తృటిలో ప్రమాదం తప్పిందన్నారు. గ్రీన్‌కో వారు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఓపెన్ బ్లాస్టింగ్ చేపట్టడంతో ప్రమాదం పొంచివుందన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులకు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

విద్యాభివృద్ధికి కృషి

గడివేముల: విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఈఓ-2 గా బాధ్యతలు చేపట్టిన ఎస్. విమలా వసుంధరా దేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఏపీటీఎఫ్ మండల, జిల్లా నాయకులు కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాడు- నేడు పనుల వేగవంతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్ బాషా, నాగన్న, జిల్లా కార్యదర్శి ఆవుల మునిస్వామి, గడివేముల మండలం ప్రధాన కార్యదర్శి మానపాటి రవి, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, నాగయ్య, వంశీకృష్ణ పాల్గొన్నారు.

➡ కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన మల్లికార్జున అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మల్లికార్జున చనిపోవడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. మృతుడికి వైఎస్సార్ బీమా వర్తించింది. మల్లికార్జున చనిపోయిన రోజు మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేశారు అధికారులు. ఆరు నెలల్లో భార్య సుజాతకు రూ.90వేలు బ్యాంకు అకౌంట్‌లో నేరుగా జమ చేయడంతో వైఎస్సార్ బీమా సొమ్ము బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చింది.

➡ సి.బెళగల్ మండలానికి చెందిన బోయ దస్తగిరి ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య పుణ్యవతి, ఇద్దరు పిల్లలకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్ బీమాలో పేర్లు నమోదు కావడంతో దస్తగిరి చనిపోయిన రోజు మట్టి ఖర్చులకు సచివాలయ సిబ్బంది రూ.10 వేలు అందజేశారు. ఆరు నెలల్లోపు పుణ్యవతి బ్యాంకు అకౌంట్‌లో బీమా సొమ్ము రూ.5 లక్షలు జమ కావడంతో ఆ కుటుంబానికి కొండంత వైఎస్సార్ బీమా రూపంలో కొండంత అండ దొరికింది.

ఆపద వేళ..ఆర్థిక భరోసా!

- పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ బీమా
- రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- బియ్యం కార్డుదారులందరూ బీమాకు అర్హులే

కోడుమూరు : ఈ రెండు కుటుంబాలే కాదు... జిల్లాలో చాలమంది ఇలాంటి సంఘటనలతో అనాథలవుతున్నారు.... ఆర్థికంగా కుంగిపోతున్నారు. ఇలాంటి అభాగ్యుల కోసం ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చి అండగా నిలుస్తోంది. కుటుంబ భద్రతలో భాగంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బీమాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆదాయ వర్గానికి చెందిన వ్యక్తులు ఏదో ఓ బీమా పాలసీని చేసుకుంటారు. పేదలు మాత్రం బీమా భద్రత కరువైంది. ఈ క్రమంలో పేద కుటుంబాలకు అండగా నిలువాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించి వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. అభాగ్యులను ఆదుకుంటుంది. అర్హులందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు ఈ ఏడాది క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించి వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి బియ్యంకార్డు దారుల కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు. వలంటీర్లు అందజేసిన సమాచారం ఆధారంగా వేల్ఫేర్ అసిస్టెంట్లు బియ్యంకార్డు కలిగిన కుటుంబ యజమాని పేరిట బీమా నమోందు చేస్తున్నారు. అనుకోని సంఘటనల మూలంగా కుటుంబ యజమాని చనిపోతే ప్రీమియం సొమ్ము చెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే తీసుకొని బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది.

వేగంగా నమోదు

వైఎస్సార్ బీమా 2023-24 సంవత్సరానికి బియ్యం కార్డు ఉన్న అందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. బీమా పథకం వైఎస్సార్ కాంతి పథం, డీఆర్‌డీఏ ద్వారా కొనసాగుతోంది. కోడుమూరు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు. సి.బెళగల్ మండలాల్లో 74,863 మంది బియ్యం కార్డుదారుల కుటుంబ యజమానులను గుర్తించి వైఎస్సార్ బీమా నమోదు చేస్తున్నారు. ఈ నెల 16 నాటికి వైఎస్సార్ బీమా గడువు పూర్తయింది కూడా. దాదాపుగా 97 శాతం వైఎస్సార్ బీమా పథకానికి అర్హులను గుర్తించారు. కోడుమూరు నియోజకవర్గంలోని 91 సచివాలయాల పరిధిలో వేల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి అర్హుల వివరాలను ప్రభుత్వానికి నివేదికను పంపించారు.

బీమాతో ప్రయోజనాలు ఇలా...

వైఎస్సార్ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్లలోపు ఉన్న బియ్యం కార్డుదారులు అర్హులు. 18 నుంచి 50 ఏళ్లలోపు మధ్యలో సహజ మరణం చెందితే నామినీకి రూ.లక్ష బీమా వర్తిస్తోంది. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన రూ.5 లక్షల బీమా వస్తుంది. 51 నుంచి 70 ఏళ్లలోపు వ్యక్తులు ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా రూ.5 లక్షల బీమా ప్రభుత్వం బాధిత కుటుబానికి చెల్లిస్తుంది.

వైఎస్సార్ బీమా పథకంలో అర్హత పొందిన కుటుంబాల వివరాలు

మండలం	అర్హత కుటుంబాలు	రెన్యూవల్ చేయించుకున్న కుటుంబాలు	కొత్తగా బీమా చేయించుకున్నా కుటుంబాలు
గూడూరు	7820	6674	124
సి.బెళగల్	17881	17556	160
కర్నూలు	26552	25789	731
కోడుమూరు	22602	22003	238


లద్దగిరిలో వైఎస్సార్ బీమాను నమోదు చేస్తున్న వలంటీర్

పథకానికి అర్హతలు ఇలా...

- బియ్యంకార్డు దారుడై ఉండాలి. ఇంట్లో సంపాదించే వ్యకికీ బీమా లభిస్తోంది. భార్య, పిల్లలు, తల్లి దండ్రులు నామినీగా ఉంటారు.
- భర్త చనిపోయి ఉంటే ఆయన భార్య కుటుంబ యజమానిగా వైఎస్సార్ బీమా పథకంలో అర్హత లభిస్తోంది. పిల్లలు, వృద్ధులు నామీనిగా ఉంటారు.
- ఉమ్మడి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కుటుంబ పోషకులుంటే వారిలో కుటుంబాన్ని పోషించే వ్యక్తిని యజమానిగా చేర్చి వైఎస్సార్ బీమా అర్హత లభిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాల ఆదాయం నెలకు రూ.12 వేలు ఉండాలి.
- వయసు 18 నుంచి 70 సంవత్సరాల్లోపు ఉండాలి.
- మాగాని భూమి 3 ఎకరాలు లేదా మెట్ట 10 ఎకరాల కన్నా తక్కువగా ఉన్న వ్యక్తులు అర్హులు.
- బీమా పథకానికి అర్హత పొందినవారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులను మంజూరు చేస్తుంది.

వైఎస్సార్ బీమా పథకం ఆదుకుంది



నా భర్త దస్తగిరి రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దిక్కుతోచని పరిస్థితి. ప్రభుత్వం చేయించిన వైఎస్సార్ బీమా కారణంగా రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి అందింది. ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నా. బీమా సొమ్ము రాకపోతే ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వ సాయం మరువం.
– పుణ్యవతి, సి.బెళగల్.

ప్రతి కుటుంబానికి బీమా కల్పించాం

వైఎస్సార్ బీమాకు అర్హత గల ప్రతి కుటుంబానికి బీమా ఉండేలా చర్యలు తీసుకున్నాం. మండలంలో బీమా రెన్యువల్‌తో పాటు, కొత్తగా అర్హత ఉన్న కుటుంబాలను వైఎస్సార్ బీమా పరిధిలో ఉండేలా గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీల సహకారంతో నమోదు చేయించాం. ఇప్పటి దాకా మండలంలో 95శాతం మేర బీమా నమోదు పూర్తయింది. మిగిలిన వాళ్లను కూడా గుర్తించి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.
– చంద్రశేఖర్, ఎంపీడీఓ, కోడుమూరు

విత్తన దుకాణాల తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్, ముడుమాల గ్రామాలలో విత్తన, పురుగు, ఎరువు మందుల దుకాణాలను మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, మందులను రైతులు ఇవ్వాలన్నారు. నిషేధిత మందులు, విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. షాపుల వద్ద ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గూడూరు రూరల్: మండలఅ పరిధిలోని గుడిపాడు, మునగాల సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఎంపీడీఓ మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడిపాడులో ఒక వలంటీర్ పోస్టు ఖాళీ ఉండగా బీసీ మహిళ, మునగాలలో మూడు వలంటీర్ పోస్టులు ఖాళీ ఉండగా రెండు బీజీ మహిళ, ఒక ఎస్సీ మహిళకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు 10వ తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ల నియామకమానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలకల్ గ్రామంలో మూడు, కొండాపురం సచివాలయ పరిధిలో ఒక్కటితో మొత్తం నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంగాల సర్పంచ్‌హనుమంతు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తెలిపారు. మంగళవారం మండలంలోని సంగాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన జన భాగిధారి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సేవలపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద మహిళలు, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు.

ఎల్లమ్మా.. చల్లంగా దీవించు మాయమ్మా!

- అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన దేవస్థానం


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ, భక్తులతో నిండిన ఆలయం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పట్టువస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నూతన వధూవరులు, ఉద్యోగ ప్రాప్తి, సంతానప్రాప్తి ప్రసాదించాలని కోరుతూ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మా ఎల్లమ్మా చల్లంగా దీవించు మాయమ్మా... అంటూ భక్తులు వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, కర్నూలు – గుంటూరు రోడ్డులో ట్రాఫిక్ నిలవకుండా దేవస్థానం ఈఓ దినేష్, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా సుంకులా పరమేశ్వరీ ఉత్సవాలు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో సుంకులా పరమేశ్వరీ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ధార్మిక సలహా మండలి కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి సహస్ర జలాభిషేకం, సామూహిక లలిత సహస్ర నామస్తోత్ర పారాయణం, శ్రీదేవీ ఖడ్గమాల పారాయణం, సప్త హారతి, శ్రీ శాకంబరి విశేష అలంకరణ పూజలు నిర్వహించారు. స్థానిక రచ్చకట్ట వద్ద నుంచి మహిళలు బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా అమ్మవారి గుడివద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మహిళలను, వృద్ధులను అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజా సమస్యలు పరిష్కారించేందుకే అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో తెలియజేస్తున్నారా ? లేదా? అని ఆరా తీశారు. కాలనీ వాసులు అర్హత ఉన్న పింఛన్లు రావడం లేదని, అలాగే విద్యుత్ మీటర్ల సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు రాని వారందరికీ అందిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నవరత్నాల పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ మద్దతుదారులకే సంక్షేమ పథకాలు అందేవని, అయితే నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయ వ్యవస్థతో నేరుగా అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనా మహమ్మరి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న ఇచ్చిన హామీలను అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం జగనన్నకు దకుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగప్ప, శ్రీనివాసులు యాదవ్, కె.పుల్లారెడ్డి, హనుమంతురెడ్డి, శివ, రమణారెడ్డి, జగదీష్, భాస్కర్, తిరుపాల్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

కల్లూరు: కల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఈనెల 23న ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఈనెల 23 నుంచి జులై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా పటిష్టంగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, తహసీల్దార్, ఈఓఆర్డీ ఒక బృందంగా ఏర్పడి జులై 1 నుంచి సచివాలయాల వారీగా పర్యటించనున్నారు. కేటాయించిన గ్రామాల వారీగా బృందాలు పర్యటించి క్షేత్రస్థాయిలో అక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఓర్వకల్లు: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్.శ్రీనివాసరావు అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. మందుల వివరాలు, వైద్య సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని డాక్టర్ ప్రమీలను ఆదేశించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

కోడుమూరు రూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుకునే ప్రతి విద్యార్థికి అండగా ఉంటున్నారని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోడుమూరులోని మోడల్ స్కూల్లో పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన తలారి రాజేష్, శరణ్య, గోవర్ధన్, పద్మావతికి జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా నగదు బహుమతులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులంతా ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డు పొందాలి

గూడూరు రూరల్: ఖరీఫ్, రబీ పంట సాగు కాలానికి సంబంధించి కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డును పొందాలని మంగళవారం ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు కౌలు రైతులు సంబంధిత పొలం కౌలు అగ్రిమెంటును తీసుకునివెళ్లి దరఖాస్తు చేసుకుంటే కౌలు కార్డును మంజూరు చేస్తారన్నారు. కౌలు కార్డు ఉంటేనే వైఎస్సార్ రైతు భరోసా, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి, పంట నష్టం పరిహారం పొందడానికి, పంటల బీమాకు అర్హులన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించకుంటే వేటు తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న అజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): జగనన్న లే ఔట్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించకపోతే వేటు తప్పదని కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిధిలోని హౌసింగ్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో 71 మంది లబ్దిదారులకు స్టేజ్ కన్వర్షన్ ప్రకారం రూ.20వేలు అందజేసేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించామన్నారు. బిలో బేస్‌మెంట్ నుంచి బేస్ మెంట్ లెవల్ వరకూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో పని చేసి బదిలీపై వెళ్ళిన అధికారులు ఇళ్ళ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎన్ని సార్లు చెప్పినా ముందుకు సాగడం లేదని, ఇకపై అలా కుదరదని జవాబుదారీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఏఈ మనోజ్‌కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి


గ్రామ సభలో మాట్లాడుతున్న కర్నూలు రూరల్ తహశీల్దార్ శివరాముడు

కర్నూలు (న్యూటౌన్): జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్షణ పథకంలో భాగంగా కర్నూలు మండలం పూడూరు గ్రామంలో జరగనున్న రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు సూచించారు. మంగళవారం సాయంత్రం కర్నూలు మండలం పూడూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వే పూర్తయ్యాక ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులను సిద్ధం చేయనున్నామని అన్నారు. డిజిటల్ రెవెన్యూ రికార్డులను తయారు చేసి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వివరించారు. గ్రామ సభలో పీఓఎల్ఆర్ డీటీ శారద, పూడూరు వీఆర్ఓ ఖాజ, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

గూడూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో ఏళ్ల నాటి భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏడీ శ్రీరామమోహన్ పేర్కొన్నారు. పొన్నకల్‌లో మంగళవారం భూ రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమగ్రంగా రీ సర్వేను చేపట్టి భూ వివాదాలు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మండల వ్యాప్తంగా 80 శాతం మేరకు రీ సర్వే పూర్తి కావడం జరిగిందని, సర్వేయర్లు పకడ్బందీగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా సర్వేకు ముందుకు వచ్చి తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు చూపి సర్వేకు సహకరించాలన్నారు. రీ సర్వేను గడువులోగా పూర్తి చేయించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు ఆయన సూచించారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్) : ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని, యువ ఓటర్ల నమోదు, సవరణ సక్రమంగా చేయాలని కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి, కోడుమూరు అసెంబ్లీ ఎన్నికల నమోదు అధికారి హరిప్రసాద్ బూత్ లెవల్ ఆఫీసర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 2024లో భాగంగా కోడుమూరు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి బెళగల్, కర్నూలు మండలాల పరిధిలోని 275 పోలింగ్ స్టేషన్‌ల బూత్ లెవల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యువ ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ ఎలా చేయాలనేది వివరించారు. ఓటర్ల జాబితా నవీకరణ చేపట్టడంలో బూత్ లెవల్ అధికారి బాధ్యతలు, విధులు ఎలా నిర్వర్తించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనల ప్రకారం యువ ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

సి.బెళగల్: బీఎల్వోలు కొత్త ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో తహసీల్దార్ శేషఫణి, డీటీ కృష్ణమూర్తి ఓటరు నమోదు, ఎన్నికల అంశాలపై మండలంలోని బీఎల్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు ప్రక్రియ నిర్వహణ, ఓటరు నమోదులో తీసుకొవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కోడుమూరు రూరల్: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ బీఎల్వోలను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వర్కూరులో జరుగుతున్న రీసర్వేను ఆర్డీఓ హరిప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా రూపకల్పనపై బీఎల్వోలతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బుధవారం నుంచి బీఎల్వోలంతా ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను తనిఖీ చేయడంతో పాటు, జాబితాలో ఉన్న వ్యక్తులు ఆ ఇంట్లో నివసిస్తున్నారా లేదా పరిశలించాలని, పొరపాట్లున్నా సరిచేయాలన్నారు. కార్యక్రమంలో కోడుమూరు తహసీల్దార్ జయన్న, డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు: ఓటరు లిస్ట్ సరిచేసే కార్యక్రమం పకడ్బందీగా చేయాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ఓటరు జాబితాతో ఇంటింటికీ తిరిగి చనిపోయిన వారు, డబల్ ఎంట్రీ, నాట్ అవేలబుల్ వారిని గుర్తించాలన్నారు. పట్టణ, వార్డు వలంటీర్ల సహాయం తీసుకోకూడదన్నారు. వలంటీర్ల సేవలు ఉపయోగించుకున్నట్లు తేలితే కఠిన చర్యలుంటాయని ఆర్డీఓ హెచ్చరించారు. తప్పిదాలు లేకుండా సరైన సమయంలో ఓటరు జాబితా ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ ప్రవీణ్ ఉన్నారు.

జగనన్న ఆణిముత్యాలు స్ఫూర్తిగా ముందుకు సాగాలి

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వం పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాల కింద ఎంపిక చేసి సత్కరించడం అభినందనీయమని కర్నూలు మండలం వసంతనగర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంపత్‌కుమార్ అన్నారు. కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని పెద్ద సంఖ్యలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకే పోటీ పడాలన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, పారితోషకం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలను వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాశ్‌రావు మాట్లాడతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు సీఎ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ కె రాంబాబు, ఎంపీటీసీ కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు వరప్రసాద్, మనోహర్, పద్మావతి, మస్తాన్‌వలీ, రమణగుప్త, పీడీ పుల్లన్న పాల్గొన్నారు.